కొంగరకలాన్‌లో కేన్స్ సంస్థ ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు. చిత్రంలో కంపెనీ ఉన్నతాధికారులు

ఫ్యూచర్ సిటీకి కేన్స్ చుక్కాని..

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 23: కొత్తగా ఏర్పాటవుతున్న ఫ్యూచర్ సిటీకి సెమీకండక్టర్ల తయారీ సంస్థ కేన్స్ టెక్నాలజీస్ సాంకేతిక చుక్కానిగా నిలువనున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. కొంగర్‌కలాన్‌లో సంస్థ ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రూ.2,800 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ యూనిట్‌తో రెండు వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. తమ ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ పరిశ్రమలకు ఆర్థిక రాయితీలు, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. హై ప్రెసిషన్ ఎలక్ట్రానిక్ అసెంబ్లీ, 3 డీ ఆప్టికల్, కృత్రిమ మేథస్సు ఆధారంగా అత్యాధునిక ఇన్‌స్పెక్షన్ వ్యవస్థలు కేన్స్ టెక్నాలజీ ప్లాంటులో అందుబాటులోకి రానున్నట్టు మంత్రి వివరించారు. భారత సెమీ కండక్టర్ మిషన్ కింద కేన్స్ టెక్నాలజీకు త్వరలో చిప్ తయారీ అనుమతి లభించే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. కొంగర్‌కలాన్ ప్లాంట్లో స్మార్ట్ మీటర్లు, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ వాహన రంగం, ఏరోస్పేస్ ఇండస్ట్రీకి అవసరమైన ఉన్నతస్థాయి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేస్తున్నదని శ్రీధర్ బాబు వివరించారు. ఈ కార్యక్రమానికి కేన్స్ టెక్నాలజీస్ చైర్మన్ సబిత రమేశ్, కంపెనీ సీఈవో రఘు పనిక్కర్, ఎండీ రమేశ్ కణ్ణన్, టీజీఐఐసీ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

గోల్డ్ బాండ్లకు గుడ్‌బై!

అమ్మకాల్ని ఆపేసే దిశగా కేంద్ర ప్రభుత్వం

అధిక బంగారం ధరలతో చెల్లింపులు భారం

మదుపరులకు లాభాలున్నా.. ఖజానాకు నష్టాలు

అందుకే ఎస్‌జీబీలకు స్వస్తి అంటున్న సర్కారీ వర్గాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 23: కేంద్ర ప్రభుత్వం సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ)కు గుడ్‌బై చెప్పనుందా?.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వాటి జారీని ఇక నిలిపివేయనుందా?.. ఈ ప్రశ్నలకు అధికార వర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తున్నదిప్పుడు. ఎస్‌జీబీలు వ్యయభరితం, సంక్లిష్ట సాధనాలుగా మారడంతో వాటి అమ్మకాలకు దూరంగా ఉండాలన్న నిర్ణయానికి కేంద్రం వస్తున్నట్టు సంబంధిత వర్గాలు ప్రముఖ జాతీయ వార్తా చానెల్ సీఎన్‌బీసీ-టీవీ18తో అన్నాయి. కాగా, ఎస్‌జీబీలకు ఇన్వెస్టర్లలో నానాటికీ పెద్ద ఎత్తున డిమాండ్ పెరుగుతున్నది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 10 శాతం ఎక్కువ చెల్లించైనా కొనేందుకు ముందుకొస్తున్నారు. భౌతిక బంగారంతో పోలిస్తే నిల్వ, చోరీ వంటి ఇబ్బందుల్లేకపోవడం, ఏటా స్థిరంగా 2.5 శాతం వడ్డీ రాబడులుండటం, పన్ను మినహాయింపులకూ వీలుండటమే ఇందుకు కారణం. ఇక ధరల విషయానికే వస్తే.. మార్కెట్‌లో బంగారం ధరలు ఏ స్థాయిలో పరుగులు పెడుతున్నాయో చూస్తూనే ఉన్నాం. 2015తో పోల్చితే ఇప్పుడు బంగారం ధర 180 శాతం ఎగిసింది. దీంతో ఎస్‌జీబీల్లో పెట్టుబడులు పెట్టినవారికి విపరీతమైన లాభాలొస్తున్నాయి. 2015 నవంబర్‌లో తొలి విడుత బాండ్ల జారీ గ్రాము రూ.2,684 వద్ద జరిగింది. కానీ అదే బాండ్ కాలపరిమితి తీరినప్పుడు గ్రాముకు రూ.6,132 చెల్లించాల్సి వచ్చింది. ఇలా ప్రతీ విడుతలో మెచ్యూరిటీ చెల్లింపులకు ఖజానాపై భారం పడుతూనే ఉన్నది. దీన్ని గుర్తించే ఇక ఈ బాండ్లు లాభసాటి కాదని ప్రభుత్వం వీటికి దూరంగా ఉండాలని చూస్తున్నదంటున్నారు.

రూ.72,274 కోట్లు

గడిచిన దాదాపు 9 ఏండ్లలో ఆర్బీఐ ఇప్పటిదాకా మొత్తం 67 విడుతల్లో ఎస్‌జీబీలను జారీ చేసింది. వీటిల్లో మదుపరులు రూ.72,274 కోట్ల పెట్టుబడుల్ని పెట్టారు. కాగా, తొలి 4 విడుతల్లో జారీ చేసిన ఎస్‌జీబీల కాలపరిమితి ఇప్పటికే పూర్తిస్థాయిలో తీరిపోయింది. వాటికి సంబంధించిన చెల్లింపులు కూడా మదుపరులకు జరిగిపోయాయి. అయితే పెట్టిన పెట్టుబడులకు రెట్టింపునకుపైగా రాబడులను ఇన్వెస్టర్లు పొందారు.

ఎస్‌జీబీ అంటే?

2015 నవంబర్‌లో సావరిన్ గోల్డ్ బాండ్లు పరిచయమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తరపున ఆర్బీఐ ఈ బాండ్లను జారీ చేస్తున్నది. ఇందులో బంగారంపై మదుపరులు చేసే పెట్టుబడులు పేపర్ల రూపంలోనే ఉంటాయి. దేశంలోకి పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్న పసిడికి అడ్డుకట్ట వేయడానికే ఈ ఎస్‌జీబీల అమ్మకానికి మోదీ సర్కారు వచ్చింది.

ధర ఎలా?

బాండ్లు జారీ చేసేటప్పుడు ఆర్బీఐ వాటి ధరను నిర్ణయిస్తుంది. ఈ ఇష్యూ ప్రైస్ ప్రకారమే ఇన్వెస్టర్లు గ్రాముల లెక్కన కొనాల్సి ఉంటుంది. కాలపరిమితి 8 ఏండ్లు. అయినప్పటికీ ఐదేండ్లు గడిచిన తర్వాత ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు. 24 క్యారెట్ బంగారానికి గాను భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ అసోసియేషన్ లిమిటెడ్ రోజూ సూచించే ధరల్లో చివరి మూడు రోజుల ధరల సగటు ప్రకారం ఇన్వెస్టర్లకు వారి పెట్టుబడులపై చెల్లింపులు జరుగుతాయి.

ఎవరు అర్హులు?

భారతీయ పౌరులు, ట్రస్టులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఛారిటబుల్ సంస్థలు, విశ్వవిద్యాలయాలు ఎస్‌జీబీలను కొనవచ్చు.

ఎలా కొంటారు?

షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు (స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్స్ బ్యాంకులు) ఈ బాండ్లను అమ్ముతాయి. ఎస్‌హెచ్‌సీఐ, పోస్టాఫీస్‌లు, బీఎస్ఈ, ఎన్ఎస్ఈలూ విక్రయిస్తున్నాయి. అన్ని ఎస్‌జీబీలు సెకండరీ మార్కెట్‌లో నమోదవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా క్రయవిక్రయాలు జరుగుతాయి. స్టాక్ ఎక్స్ఛేంజీలపై ఎస్‌జీబీల అమ్మకంపై వచ్చే సొమ్ముకు పన్ను ఉంటుంది.

74 వేల దిగువకు పసిడి

గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మరింత తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు పెరిగినప్పటికీ దేశీయంగా ధరలు దిగిరావడం విశేషం. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం ధర రూ.74 వేల దిగువకు చేరుకున్నది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.350 తగ్గి రూ.73,800కి దిగొచ్చినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. అంతక్రితం ధర రూ.74,150గా ఉన్నది. పసిడితోపాటు వెండి రూ.200 తగ్గి రూ.87 వేలకు తగ్గింది. యూఎస్ ట్రెజరీ ఈల్డ్ పుంజుకోవడం, డాలర్ మరింత బలోపేతం కావడం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని వెల్లడించారు.

మోర్గాన్ స్టాన్లీ చీఫ్ జోనాథన్ మృతి

ఇటలీలో విహార నౌక మునకతో...

సిసిలీ, ఆగస్టు 23: కార్పొరేట్ జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను తట్టుకుని నిలిచిన మోర్గాన్ స్టాన్లీ ఇంటర్నేషనల్ చైర్మన్ జోనాథన్ బ్లూమర్(70) జీవితం చివరకు విషాదాంతంగా ముగిసింది. పెను తుఫాన్‌ను ఆయనను కబళించివేసింది. కోర్టు కేసులో గెలిచిన ఆనందంలో బ్రిటిష్ టెక్ టైకూన్ మైక్ లించ్‌తో కలిసి చేసిన విహార యాత్ర చివరకు విషాదాంతమైంది. ఆయనతోపాటు ఆయన సతీమణి జుడీ, మిత్రుడు లించ్ కూడా ప్రాణాలు కోల్పోయారు. లించ్ కుమార్తె హన్నా(18), కేసును వాదించిన న్యాయవాది క్రిస్టఫర్ మర్విల్లో, ఆయన భార్య నెడా, మరో మహిళ జాడ తెలియరాలేదు. 'బ్రిటిష్ బిల్ గేట్స్'గా పేరున్న మైక్ లించ్ మోసానికి పాల్పడినట్లు దాఖలైన కేసులో అమెరికన్ కోర్టు తుది తీర్పును వెల్లడించింది. ఆయన నిర్దోషి అని కొద్ది వారాల క్రితం తీర్పు చెప్పింది. ఈ కేసులో ఆయన తరఫున జోనాథన్ బ్లూమర్ సాక్ష్యం చెప్పారు. ఈ సంతోషాన్ని అందరితో కలిసి పంచుకోవడం కోసం జోనాథన్ ఆహ్వాన మేరకు వీరంతా ఇటలీలోని సిసిలీకి విలాసవంతమైన సూపర్ యాట్ బయేసియాన్‌లో దాదాపు 22 మంది ఆనందంగా గడిపారు. పోర్టిసెల్లో తీరంలో వచ్చిన పెను తుఫాన్ దెబ్బకు ఈ సూపర్ యాట్ ఈ నెల 19న మునిగిపోయింది. దీనిలోని ఐదుగురిని మాత్రమే సహాయక బృందాలు కాపాడగలిగాయి.

ఒడిదుడుకుల్లో బ్లూమర్ కెరీర్

ఆర్థిక కష్టాలు ఒకవైపు ఇబ్బందులకు గురిచేస్తున్నప్పటికీ బ్లూమర్ మాత్రం కంపెనీలను నడుపడంలో వెనుకంజవేయలేదు. ఆయన కెరీర్ ప్రారంభించిన నాటి నుంచి అన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొదట్లో 20 ఏండ్లపాటు ఆర్థర్ అండర్సన్‌తో కలిసి సంస్థను నడిపారు. ఆ తర్వాతి 1995 నుంచి 2005 మధ్యకాలంలో ప్రుడెన్షియల్ పీఎల్‌సీలో కీలక హోదాల్లో పనిచేశారు. రైట్స్ ఇష్యూ జారీ చేయడంతో వాటాదారులతో వచ్చిన విభేదాల కారణంగా ఆ కంపెనీ నుంచి వైదొలిగారు. 2006 నుంచి 2012 మధ్యకాలంలో సెర్బెరస్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ ఎల్‌పీలో ఆపరేటింగ్ భాగస్వామిగా పనిచేశారు. ఆ తర్వాతి కాలంలో పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ కెరీర్‌ను ప్రారంభించి స్వల్పకాలంలో అగ్రస్థాయికి చేరుకున్నారు. ఆ తర్వాతి డీడబ్ల్యూఎఫ్ గ్రూపు లిమిటెడ్, యూరో గ్లోబల్ గ్రూపు లిమిటెడ్ వంటి కంపెనీల బోర్డు చైర్మన్ హోదాలో సేవలందించారు. మోర్గాన్ స్టాన్లీస్ యూరోపియన్ డివిజన్ చైర్మన్‌గా 2018 నుంచి విధులు నిర్వహిస్తున్నారు.

మరో 150 నెక్సా ఔట్‌లెట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 23: కొనుగోలుదారులకు మరింత చేరువకావాలనే ఉద్దేశంతో మారుతి సుజుకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మరో 150 నెక్సా ఔట్‌లెట్లను తెరవబోతున్నట్లు ప్రకటించింది. వీటిలో అత్యధికంగా ద్వి, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించనున్నట్లు ప్రకటించింది. శుక్రవారం బెంగళూరులో తన 500వ ఔట్‌లెట్‌ను తెరిచింది. ఈ సందర్భంగా మారుతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ మాట్లాడుతూ...నెక్సా రిటైల్ స్టోర్లను వేగవంతంగా విస్తరిస్తున్నట్లు, ఇక నుంచి తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలనుకుంటున్నట్లు చెప్పారు.

అనిల్ అంబానీపై సెబీ వేటు

Reliance Homeloanonline.in Home Finance

స్టాక్ మార్కెట్ల నుంచి ఐదేండ్లపాటు నిషేధం

రూ.25 కోట్ల జరిమానా • మరో 24 మందిపైనా కొరడా

రిలయన్స్ హెచ్‌ఎఫ్‌ఎల్ నిధుల దుర్వినియోగమే కారణం

న్యూఢిల్లీ, ఆగస్టు 23: ప్రముఖ వ్యాపార-పారిశ్రామికవేత్త, రిలయన్స్ అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (ఆర్‌అడాగ్) అధినేత అనిల్ అంబానీపై మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ కొరడా ఝుళిపించింది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగాగానీ దేశీయ స్టాక్ మార్కెట్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా ఐదేండ్లపాటు నిషేధించింది. అలాగే మార్కెట్ నమోదిత లేదా సెబీలో రిజిస్టరైన సంస్థల్లో డైరెక్టర్‌గాగానీ, ఇతర కీలకమైన పదవుల్లో మరే రకమైన హోదాల్లో ఉండకుండా గురువారం ఆంక్షలు విధించినట్టు శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అంతేగాక రూ.25 కోట్ల జరిమానా కూడా వేస్తున్నట్టు సెబీ ప్రకటించింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్) నిధుల దుర్వినియోగమే కారణమని 222 పేజీల ఆదేశాల్లో సెబీ పేర్కొన్నది. ఈ వ్యవహారంలో అసలు సూత్రధారి అనిల్ అంబానీయేనని వెల్లడించింది. ఇక ఆర్‌హెచ్ఎఫ్ఎల్‌నూ సెక్యూరిటీ మార్కెట్ లావాదేవీల నుంచి 6 నెలలపాటు తొలగించింది. రూ.6 లక్షల ఫైన్ కూడా వేస్తున్నట్టు స్పష్టం చేసింది.

ఇదీ సంగతి..

రిలయన్స్ హెచ్‌ఎఫ్‌ఎల్‌లో నిధుల దుర్వినియోగం/మళ్లింపులపై అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సెబీ ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే అన్ని ఆరోపణలపై దర్యాప్తు చేపట్టింది. నిబంధనల ఉల్లంఘనలేవైనా జరిగాయా? అన్న కోణంలో విచారణ జరిపింది. ఈ క్రమంలోనే ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ డైరెక్టర్లు, అందులో ఇతర కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారి అండతో అనిల్ అంబానీ అక్రమాలకు పాల్పడినట్టు సెబీ గుర్తించింది. అమిత్ బాప్నా, రవీంద్ర సుధాల్కర్, పింకేశ్ ఆర్ షాలతో కుమ్మక్కై అనిల్ అంబానీ కంపెనీ నిధులను దారి మళ్లించినట్టు తేలింది. వీరందరిపైనా ఐదేండ్ల నిషేధం పడింది. కాగా, అనిల్ అంబానీకి చెందిన సంస్థలకు రుణాలిస్తున్నట్టు ఈ నిధుల గోల్‌మాల్ జరిగింది. అయితే ఈ అవకతవకలపై ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ బోర్డులోని ఇతర డైరెక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కార్పొరేట్ రుణాలపై సమీక్ష జరుపాలని పట్టుబట్టారు. అయినప్పటికీ యాజమాన్యం దాన్ని పట్టించుకోలేదని తేలింది.

మరో 24 మందిపై..

ఈ మొత్తం వ్యవహారంతో సంబంధమున్న మరో 24 మందిపైనా సెబీ కఠిన చర్యలు తీసుకున్నది. రూ.21 కోట్ల నుంచి రూ.27 కోట్ల మేర జరిమానాలు వేసింది. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుంచి అక్రమంగా రుణాలు అందుకున్న అనిల్ అంబానీ సంస్థలపైనా వేటు పడింది. సంస్థ ప్రయోజనాలను తాకట్టుపెట్టి ప్రమోటర్‌తో మేనేజ్‌మెంట్ చేతులు కలిపిందని సెబీ ఈ సందర్భంగా ఆక్షేపించింది. ఆస్తులు, ఆదాయం, విలువ అసలు ఏ అర్హత లేకపోయినా వందలాది కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేశారని మండిపడింది. అందువల్లే రుణాలు వసూలవక ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్ దివాలా తీసిందని చెప్పుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ రుణగ్రహీతలపై సెబీ దృష్టి సారిస్తున్నదిప్పుడు. రుణాలు పొందినవారంతా అనిల్ అంబానీకి చెందిన వారేనా? అన్న కోణంలోనూ ఆరా తీస్తున్నది.

మదుపరులకు నష్టాలు

ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ బోర్డు డైరెక్టర్లు, ప్రమోటర్ అనిల్ అంబానీ అవినీతితో అమాయక మదుపరులు, వాటాదారులు నష్టపోయారని సెబీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. 2018 మార్చిలో సంస్థ షేర్ విలువ దాదాపు రూ.59.60గా ఉన్నది. 2020 మార్చిలో కంపెనీలో అవకతవకలు బయటపడటంతో షేర్ విలువ 75 పైసలకు దిగజారింది. ఇప్పటికీ ఇది కోలుకోలేకపోతున్నది. ఫలితంగా ఇంకా 9 లక్షలకుపైగా మదుపరులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. మరోవైపు దీనిపై అనిల్ అంబానీ గ్రూప్ స్పందించలేదు.

- *అనిల్ అంబానీతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడిన ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ డైరెక్టర్లలో బాప్నాపై రూ.27 కోట్లు, సుధాల్కర్‌పై రూ.26 కోట్లు, షాపై రూ.21 కోట్ల ఫైన్‌ను సెబీ వేసింది.*
- *రిలయన్స్ యునికార్న్ ఎంటర్‌ప్రైజెస్, రిలయన్స్ ఎక్స్ఛేంజ్ నెక్స్ట్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ క్లీన్‌జెన్ లిమిటెడ్, రిలయన్స్ బిజినెస్ బ్రాడ్‌కాస్ట్ న్యూస్ హోల్డింగ్స్ లిమిటెడ్, రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లపై 25 కోట్ల చొప్పున జరిమానా.*
- *ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుంచి అక్రమంగా రుణాలు పొందినందుకు లేదా ఆ సంస్థ నిధుల దుర్వినియోగంలో పాలుపంచుకున్నందుకు ఈ సంస్థలపై జరిమానాలు వేస్తున్నట్టు ప్రకటించిన సెబీ.*
- *పీడబ్ల్యూసీ, గ్రాంట్ థోంటన్ తదితర ఏజెన్సీల రిపోర్టుల్లో ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్టు వెల్లడి. నివేదికలో 2018 మార్చి 31న దాదాపు రూ.900 కోట్లుగానే ఉన్న రుణాల మంజూరు.. 2019 మార్చి 31కల్లా సుమారు రూ.7,900 కోట్లకు చేరినట్టు తేలింది. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌కు రుణాలిచ్చిన వాటిలో పెద్దదైన బ్యాంక్ ఆఫ్ బరోడా చేయించిన ఫోరెన్సిక్ నివేదికలోనూ సదరు కంపెనీ నుంచి రుణాలు పొందిన వాటిలో అనిల్ అంబానీకి చెందిన సంస్థలే ఎక్కువగా ఉన్నట్టు బయటపడింది.*

భారత వృద్ధి అంచనాల్లో కోత!

న్యూఢిల్లీ, ఆగస్టు 23: అంతర్జాతీయ బ్యాంకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్..భారత్‌కు గట్టి షాకిచ్చింది. ప్రస్తుత, వచ్చే ఏడాదిలో వృద్ధి అంచనాల్లో కోత విధించింది. 2024లో 6.7 శాతం మాత్రమే వృద్ధిని సాధించనున్న భారత్.. ఆ తర్వాతి ఏడాది 6.4 శాతానికి పరిమితం కానున్నదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం ఇందుకు కారణమని విశ్లేషించింది. సార్వత్రిక ఎన్నికలు జరగడంతో ఈ ఏడాది మొత్తం ప్రభుత్వం పెట్టే ఖర్చు భారీగా తగ్గిందని అమెరికా బ్యాంకింగ్ దిగ్గజ ఆర్థికవేత్త సంతను సేన్‌గుప్తా రాసిన నివేదికలో వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును 4.5 శాతానికి కట్టడి చేయడానికి ప్రభుత్వ నిర్ణయం వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదన్నారు.

జడ్చర్లలో పిడిలైట్ ప్లాంట్

హైదరాబాద్, ఆగస్టు 23: హైదరాబాద్‌కు సమీపంలోని జడ్చర్ల వద్ద ఏర్పాటు చేసిన పెయింటింగ్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు పిడిలైట్ ఇండస్ట్రీస్ ప్రకటించింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మార్కెట్లలో అధిక నాణ్యత కలిగిన టైల్స్‌ను అంటుపెట్టే ఉత్పత్తులకు డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ సరికొత్త ప్లాంట్‌ను తెరిచినట్లు కంపెనీ ఎండీ భరత్ పూరి తెలిపారు. ప్రీమియం, ప్రత్యేక ఉత్పత్తులకు క్రమంగా డిమాండ్ పెరుగుతున్నదన్నారు. ఈ యూనిట్‌లో 80 శాతం సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ఈ ప్లాంట్లోనే వినియోగిస్తున్నట్లు చెప్పారు.

బద్లాపూర్ చిన్నారులపై

పలుమార్లు వేధింపులు

విచారణ కమిటీ అనుమానం

ముంబై, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్‌లో నర్సరీ చదువుతున్న ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ద్విసభ్య కమిటీని నియమించింది. చిన్నారుల పరిస్థితిని పరిశీలించగా 15 రోజుల్లో వారిపై పలుమార్లు లైంగిక వేధింపులు జరిగి ఉండొచ్చని ఈ కమిటీ అనుమానిస్తున్నది. ఈ మేరకు కమిటీ ప్రాథమిక నివేదికను ఉటంకిస్తూ ఓ మీడియా సంస్థ పేర్కొన్నది. కాగా, ఘటన జరిగిన పాఠశాల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, పాఠశాల ప్రాంగణంలో సీసీటీవీ పర్యవేక్షణ సరిగ్గా లేదని కమిటీ గుర్తించింది. నిందితుడు ఇంతకుముందు కూడా ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడి ఉండవచ్చని కమిటీ భావిస్తున్నది.

నేటి మహారాష్ట్ర బంద్ ఉపసంహరణ

మహావికాస్ అఘాడీ శనివారం చేపట్టాలనుకున్న మహారాష్ట్ర బంద్ చట్టవిరుద్ధమని బాంబే హైకోర్టు తీర్పునిచ్చిన తర్వాత, బంద్‌ను ఉపసంహరించుకోవాలని ఎన్‌సీపీ శరద్‌చంద్ర పవార్ పార్టీ అధ్యక్షుడు శరద్‌పవార్ విజ్ఞప్తి చేశారు. ఆయన పిలుపుకు కాంగ్రెస్, శివసేన ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే సానుకూలంగా స్పందించారు. బంద్‌ను విరమించి ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య శాంతియుతంగా నిరసన చేపట్టాలని ఈ పార్టీలు నిర్ణయించాయి. ఈ ఉద్యమం అవినీతికి వ్యతిరేకంగా చేస్తున్నదని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు.

విశ్వాస ఘాతుకానికి, మోసానికి తేడా తెలియదా?

కింది కోర్టుల తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ: విశ్వాస ఘాతుకం (నేరపూరిత విశ్వాస ఉల్లంఘన), మోసానికి మధ్య తేడాను కోర్టులు అర్థం చేసుకోలేకపోవటం బాధాకరమని, రెండింటి మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. శుక్రవారం ఓ కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని తప్పు బట్టింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా కొట్టేసింది. విశ్వాస ఘాతుకం, మోసం రెండింటికీ పోలీసులు ఒకే ఎఫ్ఐఆర్‌ను నమోదు చేస్తున్నారని, చట్టాల్ని ఉల్లంఘించారా? లేదా? అన్నది న్యాయమూర్తులు పరిశీలించాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. బులంద్‌షహర్‌లోని ఓ ట్రయల్ కోర్టు ఐపీసీ-406 (నేరపూరిత విశ్వాస ఉల్లంఘన) కింద కొంతమందికి సమన్లు జారీ చేసింది. అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేయగా, వారికి నిరాశే ఎదురైంది.

'కాసుల' రాకెట్.. ఇస్రో

- పెట్టిన ప్రతి రూపాయి ఖర్చుపై 2.54 రెట్ల రాబడి
- ఇది అద్భుతమైన ప్రయోజనమన్న ఆర్థికవేత్తలు
- సంస్థ ఉత్పత్తులకు వాణిజ్యపరంగా మంచి డిమాండ్
- శాటిలైట్ల ద్వారా అనేక రంగాల్లో బహుళ సేవలు

న్యూఢిల్లీ, ఆగస్టు 23: ఇస్రో.. అంతరిక్ష రంగంలో విస్తృత పరిశోధనలు, నూతన ఆవిష్కరణతో ఆశ్చర్యపరుస్తున్న ఈ సంస్థ వైపు అమెరికాలోని నాసా సహా ప్రపంచ దేశాలన్నీ దృష్టి సారిస్తున్నాయి. అతి తక్కువ వ్యయంతో అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో ఇస్రో చేస్తున్న ఆవిష్కరణలు వారిని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతున్నాయి. అయితే రోదసి రంగంలో ప్రయోగాలు, ఆవిష్కరణలకే ఇస్రో పరిమితం కాలేదు. ఇప్పుడది పెట్టుబడికి ఒక సురక్షితమైన ప్రదేశం. దేశానికి ఆదాయాన్ని ఆర్జించిపెట్టే ఒక సాంకేతిక పరిశోధన సంస్థ. వాణిజ్యపరంగా వాటి ఉత్పత్తులకు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ఇస్రోపై ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై 2.54 రెట్ల రాబడి వస్తున్నదని ఒక కొత్త నివేదిక సూచిస్తున్నది. 2.54 రెట్ల రాబడి అంటే అద్భుతమైన రాబడి రేటని ఆర్థిక నిపుణులు సైతం పేర్కొంటున్నారు.

దేశంలో బీద, ధనిక తేడా లేకుండా ప్రతి భారతీయుడి జీవితాన్ని ఇస్రో తాకిందని దాని చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ అనూహ్య ప్రగతిని సాధించిందని యూరప్‌లోని నోవాస్పేస్‌కు చెందిన నిపుణుడు స్టీవ్ బోచింగర్ తెలిపారు. గత 10 ఏండ్లలో ఈ రంగం వాటా భారత ఆర్థిక వ్యవస్థలో 60 బిలియన్ డాలర్లకు పెరిగిందని దీని ద్వారా 47 లక్షల ఉద్యోగాల సృష్టి జరుగగా, 34 బిలియన్ డాలర్లు పన్ను రూపంలో ఆదాయంగా లభించిందని నోవాస్పేస్ ఒక నివేదికలో తెలిపింది.

నాసా కన్నా అతి తక్కువ బడ్జెట్ ఉన్నా...

గత 55 ఏండ్లుగా రోదసి రంగంపై భారత్ పెట్టిన పెట్టుబడి.. అమెరికా రోదసీ సంస్థ నాసా ఒక్క ఏడాది బడ్జెట్ కన్నా తక్కువని బోచింగర్ చెప్పారు. ఇస్రో ప్రస్తుత వార్షిక బడ్జెట్ సుమారు 1.6 బిలియన్ డాలర్లు కాగా, నాసా వార్షిక బడ్జెట్ 25 బిలియన్ డాలర్లు. అంటే భారత్ బడ్జెట్ కన్నా 15.5 రెట్లు ఎక్కువ. ఇస్రో రోదసి ప్రయాణం మొదలు పెట్టినప్పటి నుంచి 2023 డిసెంబర్ 31 వరకు 127 భారత ఉపగ్రహాలు ప్రవేశపెట్టింది. ఇందులో ప్రైవేట్ సంస్థలు, విద్యాసంస్థలు తయారు చేసినవి కూడా ఉన్నాయి. భారత్ ప్రయోగించిన ఉపగ్రహాలలో తక్కువ భూమి కక్ష్యలో ప్రవేశపెట్టినవి 22, జియో సింక్రోనస్ ఆర్బిట్‌లోకి పంపినవి 29 ఉన్నాయి. వీటికి అదనంగా చంద్రయాన్-2, ఆదిత్య-ఎల్1, చంద్రయాన్-3 లాంటి మూడు లోతైన అంతరిక్ష ప్రయోగాలు కూడా విజయవంతంగా కొనసాగుతున్నాయి. భారత్ ఇప్పటివరకు 97 రాకెట్లను, 432 విదేశీ ఉపగ్రహాలను కూడా ఇస్రో వేదికగా ప్రయోగించారు.

ఎన్నో రంగాలకు ప్రయోజనం

వాతావరణం, తుపానుల పర్యవేక్షణ, కమ్యూనికేషన్, నావిగేషన్, నగర ప్రణాళిక, పంటల విశ్లేషణ, ఏటీఎం వంటి రంగాలను విశ్లేషించగలిగే రూ.50 వేల కోట్ల విలువైన 50 ఉపగ్రహాలను భారత్ తయారు చేసింది. అంతేకాకుండా ఇస్రో తయారు చేసిన శాటిలైట్ల వల్ల ప్రతి రోజూ 8 లక్షల మంది జాలర్లకు ప్రయోజనం చేకూరుతుందని, ప్రతి రోజూ చేసే వాతావరణ హెచ్చరికల ద్వారా 104 కోట్ల మంది భారతీయులకు లబ్ధి చేకూరుతున్నదని నోవాస్పేస్ తన నివేదికలో వెల్లడించింది.

నిఘా ఉపగ్రహాలతో భరోసా

భారత శాటిలైట్ల ద్వారా రక్షణ రంగానికి అనూహ్యమైన ప్రయోజనాలు చేకూరుతున్నాయ. భారత దేశ పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లో రాత్రి, పగలు నిరంత నిఘా కారణంగా శత్రు దేశాల కదలికలు ఎప్పటికప్పుడు తెలిసిపోతున్నాయి. ఈ నిఘా ఉపగ్రహాలు ఎంత శక్తివంతమైనవి అంటే పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ఆ దేశ ప్రధాని ఇంటిలో పార్కు చేసిన కార్ల నెంబర్ ప్లేట్ల చిత్రాలను కూడా ఇవి స్పష్టంగా పసిగడతాయి. ఇక అంతర్‌గ్రహ అన్వేషణ రంగంలో భారత్ తన తొలి ప్రయత్నంలోనే చంద్రుడు, అంగారక గ్రహాల కక్ష్యను పట్టుకొని చరిత్ర సృష్టించాయి.

దేశ ప్రజలకు మోదీ అభినందనలు

శుక్రవారం మొదటి జాతీయ అంతరిక్ష దినం సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు తెలిపారు. రోదసి రంగానికి సంబంధించి తమ ప్రభుత్వం భవిష్యత్తు నిర్ణయాల శ్రేణిని చేపట్టిందని, రాబోయే కాలంలో కూడా ఇది మరింత అధికంగా కొనసాగుతుందని అన్నారు. అంతరిక్ష రంగంలో మనం సాధించిన ప్రగతిని ఈ సందర్భంగా గుర్తు చేసుకుని, వాటి సాకారానికి కృషి చేసిన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులకు అభినందనలు తెలుపుదామని అన్నారు. కాగా, బహుళ సంఖ్యలో ఉపగ్రహాల ప్రయోగం కారణంగా అంతరిక్షంలో వ్యర్థాలు పేరుకుపోవడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. 2030 నాటికి వ్యర్థ రహిత లక్ష్యంగా ఇస్రో అంతరిక్ష ప్రయోగాలు చేపట్టాలని ఆమె సూచించారు.

కేజ్రీవాల్ బెయిల్ విచారణ వాయిదా

న్యూఢిల్లీ: మద్యం పాలసీ కేసులో అరెస్ట్ అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో శుక్రవారం మరోమారు ఎదురురెబ్బ తగలింది. బెయిలు కోసం ఆయన పెట్టుకున్న పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు సెప్టెంబర్ 5కు వాయిదా వేస్తూ, కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. రిజాయిండర్ వేసేందుకు కేజ్రీవాల్‌కు రెండ్రోజుల సమయం ఇచ్చింది. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను విచారించేందుకు తమకు అనుమతి లభించినట్టు సీబీఐ తెలిపింది.

స్నాతకోత్సవ డ్రెస్ కోడ్ మార్చండి

కొత్తది రూపొందించాలన్న ఆరోగ్య శాఖ

న్యూఢిల్లీ, ఆగస్టు 23: స్నాతకోత్సవాల్లో ధరించడానికి ఆయా రాష్ట్ర సంప్రదాయాలకు సరిపడేలా భారత సంప్రదాయాలకు అనుగుణంగా తగిన దుస్తుల కోడ్‌ను రూపొందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ తన అధీనంలోని సంస్థలను కోరింది. వలస వారసత్వంగా ప్రస్తుతం ధరిస్తున్న టోపీతో ఉన్న నల్ల దుస్తులను మార్చాల్సిన అవసరం ఉందని ఆ శాఖ పేర్కొంది. ఐరోపాలో మధ్య యుగాలలో ఉద్భవించిన దానిని బ్రిటీష్ వారు మన దేశంలో ప్రవేశపెట్టగా అదే వారసత్వంగా వస్తున్నదని తెలిపింది.